# కుట్టమ్మాళ్

–శిష్ట్లా ఉమామహేశ్వరరావు



ఆయిడ పేరు కుట్టమ్మాల్. కుట్టి, కుట్టి అని పిలిసేవోరు. ఆయిడ్ని కనుక్కోడానికి ఓబాయికి మూణ్ణాళ్ళు పట్టింది.

అప్పుడు మా కంపెనీ మద్రాసులో వుంది. రాయపేట నుంచి మైలాపూర్ పోతుండా. మధ్యాన్నం అయింది. నా ముందరే నడుత్తున్న దాయిడ. ఆయన కాలేపు నుంచి ఆ పొట్టి మడిసిని సూసి పద్దాలుగేండ్లుంటాయేమో అనుకున్నా.

ఒచ్చేపోయేవార్ని విదిలించుకుంటూ పోయి పోయి ఆయిడ ఓ ఇంటి గేటును తీస్తోంది. మొగం సూసి ఆచ్చర్యపోయాను. మడిసికి పాతికేళ్ళుంటాయి. ఆ ఆశ్చర్యంతో ముందుకుపోయి యెనక్కు తిరిగేసరికాయిడ లేదు.

కంపెనీ పోయేసరికి రేషన్ లెక్కలు తప్పు చెప్పానని ఆడెర్లీ రూముకు పిలిశారు. ఆడ పోయిం తర్వాత ఈయిడ ఇసయమే మరిసిపోయా.

ఆ తర్వాత తలుసుకున్నా. ఆయిడె ఇగ్రహం అచ్చుకొట్టినట్లు మనసు కొచ్చింది. ఆ గుండ్రని మొగం, ఆ చిట్టి గడ్డం అన్నీ తలుసుకున్నా. ఆ వారం నాకిచ్చే చిగరెట్ల రేసనంతా తనకిస్తానంటే ఓబయగా డాయిడ వునికి యెక్కడో కనుకొత్తానని ఒప్పుకున్నాడు.

ఓబాయిగాడి తల నలుసదరంగా వుంటుంది. గొర్రె జుత్తల్లే బిరుసు. ఆడు మాత్రం బిరుసు మనిసి కాదు. యారితో మాటాడినా నిముసంలో ఆరి నమ్మకం తీసుకుంటాడు. ఎంత లావైన పనైనా నాజూగ్గా చేసుకొత్తాడు.

మూడునాళ్ళు తిరిగేట్ట. నాలుగో రోజు వొచ్చి ఆ పిల్ల పనిసేత్తున్న యిల్లు కదా కమామీసూ పట్టుకొచ్చాడు. ఆయిడ పేరు కుట్టమ్మాలు, పిలోడంమాత్రం 'కుట్టి' అంటారు, అని సెప్పాడు.

''ఓ పని సేయరా! ఓ సిన్న సీటిముక్క రాయి. మెల్లిగా పోయి ఆయిడ కిచ్చొత్తా''నన్నాడు ఓబాయి.

నాకు సీటీలు రాయమంటే తలనొప్పి. డూటీ గందా అని రేషను లెక్కలు మాత్రం రాత్తుంటా. సరేలే అని ఓ సీటిముక్క రాసిచ్చా.

మర్నాడు రాయిపేట ఆసుపత్రి మలుపులో దాన్ని కలుసుకున్నా.

నాకు సిగ్గేసింది. ఆయిడకీ సిగ్గేసింది.

''చినీమా పోదాం'' అన్నాను.

''ఉహు! మా అక్కకు ఒంట్లో బాగుండ్లా, యింటికెళ్లాలి'' అన్నది.

''నీ పేరు బలేగుంది'' అన్నాను.

''నీ పేరేంది'' అంది.

''నా పేరా లచ్చన్న, చేహితులు తమాసాకు లచ్మీకె లచ్చన్నని పిలుత్తారు.''

''తమాసా పేరే!'' అంది.

''మళ్ళీ యెప్పుడు కలుత్తా'' అన్నాను.

''రేపిదేయాల కిక్కడే కలుద్దాం'' అంది.

ఆ చీకటి సందులో ముద్దెట్టుకోపోయా. ఇప్పుడొద్దంటూ పోయింది.

మర్నాడు అనుకున్న టైముకు అరగంట ముందుపోయా. ఆయిడ మాత్రం టైముకే వొచ్చింది.

''ఎక్కడికి పోదాం'' అన్నాను.

''నీ యిట్టం'' అంది.

''ముందేదైనా వోటలికి పోదాం పద'' అన్నాను.

మిలిటరీ వోటలు పోయాం. పలావ్, కుర్మా, పరోటా లార్డరు సేశాం.

''చినీమా పోదామా'' అన్నాను.

''ఊ! డబ్బెందుకు వృధా సేయడం'' అంది.

''నాకు సంతోషం కొద్దీ నే కర్సు పెడుతున్నా'' నన్నాను.

చినీమా కింకా ఓ గంట టైముంది. దూరంగా బెంచీల మీద కూకున్నాం.

''నీ సంగతేం తెలీదు నాకు'' అంది.

''నా సంగతేం వుంది. నేను మిలిటరీ సేరి నాలుగేండ్లయింది.

అంతకుపూర్వం కిల్లీ కొట్టెట్టాను. ఇప్పుడు మా తమ్ముడు సూత్తున్నాడు దాన్ని'' అన్నాను.

ఆనాడు కూడా ముద్దెట్టుకోపోతే వొద్దంది. నా కర్మంకాలా.

ఆళ్ళింటిదాకా పోయి పంపించా.

ఆళ్ళిల్లు మైలాపూరుకూ రాయపేటకూ మద్దె కొబ్బరిసెట్లల్లో వుంది. ఆయిడ్నిడి సెట్టడం ఆయిడక్క సూసింది. ఏమన్లేదు.

మళ్ళీ మర్నాడు మామూలుగా కలుసుకున్నాం. బీచికి పోయాం. ఇసక మీద కూకున్నాం.

''మా అక్క నిన్ను సూసింది. నువ్వెళ్ళిం తర్వాత నన్ను సాలా అడిగింది.''

''ఏమనడిగిందేం''

''ఆ! నీకెట్లా తెలుసు! ఆయనకి పెండ్లయిందనుకో, నిన్నేం చేత్తాడు. మడుసుల యవారాలు తెలీకుండా చేహం చేయకూడదు అంటూ యేందేందో అడిగింది'' ''నువ్వేమన్నా!''

''ఆ! ఆయన సాలా పెద్దమడిసి, పెండ్లి కానోడు, నన్ను పెండ్లి సేసుకుంటారులే. సొంతిల్లుందట అని నాకు తెలిసినంత వొరకు సెప్పాను'' అన్నది.

''సరే, యింక యింటికి పోదాం లే!'' అన్నాను.

''యేం కోపమొచ్చిందా'' అన్నది కుట్టి.

''కోపం రాలేదు కాని నేనొకటనుకుంటుంటే నువ్వొకటనుకుంటున్నావు. మనిద్దరికీ కుదరలేదులే వెళ్దాంపా'' అన్నాను.

''నే నన్న మాటలు నాయమా కాదా'' అని అడిగింది.

''నీ వన్నది నాయమే, నేననుకుందీ నాయమే. మనిద్దరి నాయాలూ సరిపోడంలా!'' అన్నాను.

''అదేం''

''నాకు భార్యుంది. ఇద్దరు బిడ్డలున్నారు. నాకు పెండ్లి కాలేదని అనుకోడం పొరబాటు.''

''ఏంటో నా మొదటోడ్ని ఇడిసిపెట్టి మూడేళ్ళయింది. అప్పట్నుంపి మొగాళ్ళంటే బలే జాగొర్తగా వుంటుంటా, తప్పా!'' అన్నది కుట్టి.

''తప్పు నాదే'' అని వత్తూ వత్తూ లెంపలేసుకున్నా.